క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: నగరంలోని పలివేల్పుల క్రాస్ వద్ద నిర్వహిస్తున్న సాంఘీక సంక్షేమ బాలికల కళాశాల (వరంగల్-వెస్ట్)లో 2023-24 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమలత తెలిపారు. ఎంపీసీ, బీపీసీల్లో మిగిలిన సీట్లకు ఈనెల 16 లోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నయీంనగర్: 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జీఎం డీఐసీ హన్మకొండ ఎం.హరిప్రసాద్ కోరారు. బుధవారం హన్మకొండ కిషన్‌పుర సీడీయూ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపకులపతి ప్రొఫెసర్ జి.దామోదర్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

13న చిత్రలేఖనం పోటీలు

హన్మకొండ చౌరస్తా: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 13న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు, వివరాలకు మొబైల్ నెంబర్ 81436 43337లో సంప్రదించవచ్చని ఆమె పేర్కొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

కాజీపేట: బాల్య వివాహాలు లేని భారత సమాజ నిర్మాణం కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సీఐ సంజీవరావు అన్నారు. 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ప్రధాన రహదారిపై ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం కైలాష్ సత్యార్థి బాలల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు లేని భారత్ అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శేర్ ఎన్జీవో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వసుంధర, హెచ్ఎం మామిడాల రాజేంద్రం, సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరసన

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లోని రైల్వే డ్రైవర్ల కార్యాలయం ఎదుట గురువారం రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు లోకో రన్నింగ్ బ్రాంచీ సంఘ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూపెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ పాత పెన్షన్ స్కీంనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తరలివచ్చి పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి

కాజీపేట అర్బన్ : గణితంపై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని టీఎస్ కాస్ట్ ప్రాజెక్ట్ అసోసియేట్ కో-ఆర్డినేటర్లు అనిల్, రాములు తెలిపారు. న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రీజినల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణిత మహోత్సవానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో గణితం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎంఎం. స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


'ఆరె'లకు సముచిత స్థానం కల్పించాలి

నయీంనగర్: ఆరె కులస్తులకు సముచిత స్థానం కల్పించాలని, పరకాలలో నాగుర్ల వెంకన్నకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని, ఛత్రపతి శివాజీ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఆరెకుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోటె చిరంజీవి డిమాండ్ చేశారు. బుధవారం హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

'ఏవీవీ'లో ఇంటర్వ్యూలు

రామన్నపేట : ఏవీవీ డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు యాజమాన్యం రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల కోసం బుధవారం ఫైనలియర్ విద్యార్థులతో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.సంజీవరావు తెలిపారు. ఐసీఐసీఐ ప్రతినిధి హర్షద్ మాట్లాడుతూ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన



వరంగల్: కాశిబుగ్గలోని ఎల్‌బీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో మాక్ ఎలక్షన్స్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాల డీన్ రంజిత్, సి బాచ్ ఇన్‌చార్జ్ జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం

- వర్ధన్నపేట నియోజకవర్గ కో-ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్

హసన్‌పర్తి : కాంగ్రెస్ పార్టీ యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ కో-ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం యూత్ కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్, మండల పార్టీ అధ్యక్షులు చరణ్, మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మధు, డివిజన్ అధ్యక్షుడు కిరణ్, పొన్నాల రఘు, పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కార్యకర్తల ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జెండాను కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ ఎగురవేశారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కొడిపాక గణేష్ కుమార్, టీపీసీసీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, కోటేశ్వర్, కుమార్ యాదవ్, రాజయ్య, రమేష్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



హసన్‌పర్తి : కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

హన్మకొండ చౌరస్తా: యువజన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం హనుమకొండలోని కుమార్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం హనుమకొండ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. శ్రీనివాసరావు, గణేష్ భాస్కర్, కవిత, ధన్‌రాజ్, శ్రవణ్ పాల్గొన్నారు.



హన్మకొండ చౌరస్తా: జెండా ఆవిష్కరిస్తున్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రంగనాథ్

నిత్యావసర సరుకుల పంపిణీ



వరంగల్ చౌరస్తా: బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న సీపీ రంగనాథ్, ఎమ్మెల్యే



హన్మకొండ కల్చరల్: బాధితులకు సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వరంగల్ చౌరస్తా : సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదినం సందర్భంగా ఇటీవల అతి భారీ వర్షాలతో నీట మునిగిన హంటర్‌రోడ్ ఎన్టీఆర్ కాలనీ వరద బాధితులకు అభిమాన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను వరంగల్ సీపీ రంగనాథ్, తూర్పు ఎమ్మెల్యే నరేందర్ పంపిణీ చేశారు. మహేష్ బాబు యువసేన అభిమానులు బాధితులను ఆదుకోవడం అభినందనీయమని వారు కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గందె కల్పన, బీఆర్ఎస్ నాయకులు గందె నవీన్ కుమార్, అభిమాన సంఘం నాయకులు, యువసేన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీభువనేశ్వరి మాత ట్రస్ట్ సాయం

హన్మకొండ కల్చరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం దొడ్ల గ్రామంలో వరదలకు ఇళ్లు కొట్టుకుపోయి తినడానికి తిండిలేక నిరాశ్రయులైన గిరిజన కుటుంబాల గురించి 'సాక్షి'లో వచ్చిన కథనాలకు చలించిన హనుమకొండకు చెందిన శ్రీభువనేశ్వరి మాత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బుధవారం బాధితులకు సాయం అందజేశారు. హన్మకొండ రాంనగర్ కాలనీ వాసులు, రాంనగర్ బతుకమ్మ పరపతి సంఘం, ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబాలకు దుస్తులు, నిత్యావసర సరుకులు, ప్లాస్టిక్ డబ్బాలు, టార్పిలైట్లను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మోత్కూరి రాము, ప్రధానకార్యదర్శి పద్మజ, కోశాధికారి గుండవరం విధుమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు వరద బాధితుల కష్టాలను సమాజం దృష్టికి తీసుకువచ్చిన 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా : కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మహా పడావ్‌ను జయప్రదం చేయాలని వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీఎం సెంటర్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. యూనియన్ నాయకులు ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి గన్నార రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి పుల్లా రమేష్ , ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని కార్పొరేటు అనుకూల కేంద్ర బీజేపీ ప్రభుత్వం బరితెగించి ప్రజా కార్మిక వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మాలోతు సాగర్, కాసు మాధవి, శంకరయ్య, బాలరాజు, యాదగిరి,మధుకర్, మల్లయ్య, చెన్నకేశవులు, చెన్నయ్య, గోవర్ధనచారి పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవాలి

కరీమాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకుని పరిశోధన విద్యార్థులు కొత్త ఒరవడిని సృష్టించవచ్చని కళాశాల పూర్వవిద్యార్థి, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెనిసిల్వేనియాలో రేడియాలజీ విభాగంలో పరిశోధకులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.రవిప్రకాశ్‌రెడ్డి సూచించారు. వరంగల్‌లోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బయోమెడికల్ రీసెర్చ్‌లో బయో మార్కర్స్ ప్రాముఖ్యతను వివరించారు. క్లినిపోల్ అధ్యక్షుడు ముజీబుద్దీన్ మాట్లాడుతూ ఫార్మ డి, బి.ఫార్మసీ విద్యార్థులకు క్లినికల్ రీసెర్చ్, ఫార్మ కో విజిలెన్స్, మెడికల్ కోడింగ్‌లలో అద్భుతమైన ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. ఎక్సల్ గ్లోబల్ సర్వీసెస్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటేశ్వర్‌రావు, కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, డాక్టర్ సత్యనారాయణ పట్నాయక్, డాక్టర్ తాళ్ల వరుణ్, డాక్టర్ బేతి శ్రీనివాస్, డాక్టర్ జయపాల్, ఏట మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



రవిప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్ మల్లేశం

నేడు తపాలా ఉద్యోగుల ధర్నా

హన్మకొండ: ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం, సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10న ఉద్యోగులు ధర్నా చేపట్టనున్నట్లు ఆ సంఘం పోస్టల్ హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లక్ష్యంతో కష్టపడితే ఏదైనా సాధించవచ్చు

మామునూరు: లక్ష్యంతో కష్టపడితే ఏదైనా సాధించవచ్చని టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో శిక్షణ పొందిన ఎస్సై అభ్యర్థులు నిరూపించారని కమాండెంట్ సింధుశర్మ అన్నారు. బెటాలియన్‌లోని ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఇద్దరి హనుమకొండ జిల్లా దామెర మండలం పసరగొండకు చెందిన అర్చన, వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన రోహిత్‌లు సివిల్ ఎస్సైలుగా ఎంపికయ్యారు. వీరిని, ట్రెనింగ్ అధికారులను కమాండెంట్ సింధుశర్మ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా అభినందించారు. కార్యక్రమంలోఅసిస్టెంట్ కమాండెంట్ పి.జయరాం, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



మామునూరు: అర్చనను అభినందిస్తున్న కమాండెంట్ సింధుశర్మ

ఎస్సైగా ఎంపికైన మనీషాకు సన్మానం

మడికొండ: మడికొండకు చెందిన వస్కుల మనీషా ఎస్సైగా ఎంపికవడంపై ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు మామె ఇంటివద్ద కలిసి పూలబొకే, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మనీషా మాట్లాడుతూ పేదలకు సేవ చేసే భాగ్యం కలగడం తన అదృష్టం అన్నారు. ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్, ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి, శంకర్, వీరస్వామి, ఎస్సీ, ఎస్టీ జిల్లా అధ్యక్షుడు స్వదేశ్ కుమార్, ఉపాధ్యక్షుడు విజయ్, మనీషా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కాజీపేట : రాష్ట్ర వ్యాప్తంగా కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం లభించేలా చూడాలని కోరుతూ సంఘం నాయకులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ తాళ్లపల్లి రామస్వామి, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొని సాంబయ్య గౌడ్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బుర్ర శ్రీనివాస్, వినోద తదితరులు కలిశారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల



హసన్‌పర్తి: ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎస్సారెస్పీ జలాలు చేరాయి. ఖరీఫ్ కాలం ముగిసే వరకు (ఆగస్టు-నవంబర్) నీరు విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం 4500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వారం తప్పించి వారం ఈ నీరు విడుదలవుతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మంతో పాటు సూర్యపేట వరకు నీరు అందించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారులను కలిసిన ఉద్యోగులు



హన్మకొండ: సీబీ సీఐడీ అడిషనల్ ఎస్పీ అంగోత్ నరేష్ నాయక్, డీఎస్పీ నందిరాం నాయక్‌ను విద్యుత్ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. బుధవారం విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు భూక్యా వాలు నాయక్, కార్యదర్శి అజ్మీర శ్రీరాం నాయక్, అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా నరేష్‌నాయక్‌ను కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎల్.దేవిదాస్, బి.చందులాల్, కేబి.రాజేందర్, ఎల్.శశికాంత్ నాయక్, డి.తారాచంద్, భూక్య రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కరీమాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా వరదలో సర్వం కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లించి ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడు అర్షనపెల్లి విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సమ్మయ్యనగర్, రాజాజీనగర్, విద్యానగర్, వరంగల్ సరస్వతీనగర్, పోతననగర్, సాయినగర్, కాపువాడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాల మూలంగా రోడ్లు, కల్వర్టులు, మంచినీటి వ్యవస్థ, డ్రైనేజీలు, ఇండ్లు దెబ్బతినడంతోపాటు ప్రజలకు భారీగా నష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండీ.రహీమ్, బర్ల యాకుబ్, నల్లకుంట రవికుమార్, కాగితాల జయశంకర్, మాడగాని మనోహర్, అజీం తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద ముంపునకు గురైన బాధితులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి రొయ్యల రాజు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ రహీంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ మండల కార్యదర్శి కుమార్, నాయకులు జగన్, కదారి కిరణ్, ప్రమీల, సత్తెమ్మ, స్వరూప, దేవేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన రైల్వే నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు బుధవారం వేర్వేరుగా ఢిల్లీకి తరలివెళ్లారు. నూతన పెన్షన్ స్కీం వద్దని పాత పెన్షన్ స్కీంనే కొనసాగించాలని గురువారం దేశవ్యాప్తంగా అన్ని ట్రేడ్ యూనియన్ల నాయకుల ఆధ్వర్యంలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్నట్లు ఆయా ట్రేడ్ యూనియన్ల నాయకులు తెలిపారు. కాజీపేట నుంచి రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి తరలివెళ్లారు. అదేవిధంగా సికింద్రాబాద్ నుంచి రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఎజీఎస్ భరణిభానుప్రసాద్, సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ డి.భుజంగరావు ఆధ్వర్యంలో హైదరాబాద్-కొత్తఢిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో తరలివెళ్లారు. మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్, సదానందం, సాయికుమార్, వేదప్రకాష్, గిరిమిట్ల రాజేశ్వర్, జానీ, తిరుపతి, భిక్షపతి, రాజేందర్, సమ్మయ్య, శ్రీనివాస్ యాదవ్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నుంచి సీడబ్ల్యూసీ మెంబర్లు వీడ్కోలు పలికారు.

కాజీపేట జంక్షన్‌లో గద్దర్ సంతాప సభ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్యాలయంలో బుధవారం ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ప్రజా యుద్ధనౌక గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఆపరేటింగ్ అండ్ కమర్షియల్ బ్రాంచీ సెక్రటరీ కెఎస్.రావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురి పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, ఎస్సీ ఎస్టీ సంఘం సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ బి.వీరన్న, రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు ఆర్.కుమారస్వామి, చింత తిరుపతి, హరిబాబు, మోతీలాల్, మురళీకృష్ణ, నరేష్, నాగరాజు, జక్రియ, రవీందర్, సుదర్శన్ పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటానికి తేజోమాయి మాల కుల సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కడిపికొండ క్రాస్‌రోడ్డు నుంచి గ్రేటర్ అధ్యక్షుడు మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, కోండ్ర నర్సింహారావు, సిహెచ్.కొమ్మాలు, సాంబయ్య, బండి రాంచందర్, తండమళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట రూరల్: గద్దర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు

సంక్షిప్త వార్తలు

సద్వినియోగం చేసుకోవాలి

కరీమాబాద్ : ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయ విస్తరణాధికారి డాక్టర్ ఎం.మహేందర్ అన్నారు. మామునూరు కేవీకేలో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా 'నా మట్టి-నా దేశం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలో భాగంగా పౌల్ట్రీనైట్ షెల్టర్స్, కుట్టుమిషన్లు, పల్వరైజర్లు, టార్పాలిన్ కవర్లు అందజేశారు.

వాల్యు ఎడ్యుకేషన్‌పై సెమినార్

మడికొండ: సీబీఎస్ఈ న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో మడికొండలోని మాస్టర్‌జీ పాఠశాలలో వాల్యు ఎడ్యుకేషన్‌పై ఒకరోజు సెమినార్ నిర్వహించారు. కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమంలో హనుమకొండ జోన్ సీబీఎస్ఈ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చితకొట్టడం సరికాదు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ అత్యుత్సాహంతో చిరువ్యాపారులను చితకొట్టడం.. నా కుమారుడిని బూతులు మొబైల్‌ను ధ్వంసం చేసి కొట్టడం సరికాదని 39వ డివిజన్ కార్పొరేటర్ సిద్ధం రాజు అన్నారు. నిరంకుశంగా వ్యవహరించిన సీఐని తక్షణమే పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుంటే తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టిన ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఆర్సీ గంగాధర్,కృష్ణం రాజు, మనోహర్, విజయ్‌కుమార్, చేరాలు, రాజు పాల్గొన్నారు.

పరామర్శ

వరంగల్ చౌరస్తా : నగరంలోని 28వ డివిజన్‌కు చెందిన వ్యాపారస్తుడు పిన్నా రాజన్న ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను కార్పొరేటర్ గందె కల్పన పరామర్శించి కుటుంబ స భ్యులను ఓదర్చారు. నవీన్‌కుమార్, రా మారావు,నాగరాజు, నారాయణ ఉన్నారు.

పోలీసుల దాడిని ఖండిస్తున్నాం

న్యూశాయంపేట : సెక్రటేరియట్ ముట్టడి తలపెట్టి ముందుకు సాగుతున్న సందర్భంలో విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు మణికంఠరెడ్డి, రహమాన్, ఇతర నాయకులపై డీసీపీ వెంకటేశ్వర్‌రావు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

వరంగల్: వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపటినట్లు సీఐ మహేందర్ తెలిపారు. బుధవారం మార్కెట్ ఎదుట, రెడ్డిపాలెం, ఆరెపల్లి గ్రామాల పరిధిలో పలు వాహనాలను తనిఖీలు చేశామన్నారు. తనిఖీల్లో వాహనాల రిజిస్ట్రేషన్, దొంగ వాహనాలు, సైరన్, సైలెన్సర్లను తనిఖీ చేశామన్నారు. ఎస్సైలు రాజన్ బాబు, పోగుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

హోంగార్డులను క్రమబద్ధీకరించాలి

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్‌లను క్రమబద్ధీకరించాలని, కోర్టు ఆర్డర్ ఉన్న హోంగార్డ్‌లను ఎలాంటి షరతులు లేకుండా విధుల్లోకి తీసుకోవాలని హోంగార్డులు సీఎం కేసీఆర్‌ను కోరారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

వలంటీర్లు, అధ్యాపకుల ప్రతిజ్ఞ

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.రాజారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురభి వినోద్‌రావు సమక్షంలో వలంటీర్లు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన రఘుపతి

హన్మకొండ: జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాంను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డిపల్లి రఘుపతి కలిశారు. బుధవారం న్యూఢిల్లీలోని కార్యాలయంలో ఆయనను కలిసి బీసీ సమస్యలను వివరించారు.

పూర్వ జేసీ దేవవ్రతకంత మృతి

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1993-95 కాలంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవవ్రతకంత బుధవారం ఒడిశా రాష్ట్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ప్రకటన విడుదల చేశారు. ఆయన భార్య సీనియర్ ఐపీఎస్ అధికారి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎస్పీగా కూడా పనిచేశారు.

సమరయోధులకు ఘన సన్మానం

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ తూర్పు కోఆర్డినేటర్ బాకం హరిశంకర్, పొట్టి శ్రీనివాస గుప్తా ఆధ్వర్యంలో మాజీ సైనిక అధికారులు, రిటైర్డ్ పోలీస్ అధికారులను, స్వాతంత్ర సమరయోధులను ఘనంగా సన్మానించారు. ఆగస్టు 9 నుంచి 26 వరకు చేపట్టే కార్యక్రమంలో భాగంగా క్విట్ ఇండియా స్మృతులు గుర్తుచేసుకుని రిటైర్డ్ అధికారులు ఆనాటి పోరాట ఘట్టాలను, అనుభవాలను వివరించి ఉద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, మహేష్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్ బాబు, సతీష్ షా, అచ్చ విద్యాసాగర్, గంట రవి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వరంగల్: నగరంలోని 12, 13వ డివిజన్లలోని బ్యాంక్ కాలనీ, దేశాయిపేట, ఎస్ఆర్ఎస్‌నగర్, లక్ష్మీ మెగాటౌన్‌షిప్‌లతో పాటు ఎల్బీనగర్‌లలో సుమారు రూ.3 కోట్ల విలువైన పనులకు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే తాజ్ ఫంక్షన్‌హాల్ పక్కన రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు.

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ లేబర్‌కాలనీలో రూ. 21.56 లక్షల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ వస్కుల బాబుతో కలిసి ఎమ్మెల్యే నరేందర్ శంకుస్థాపనలు చేశారు.

క్విట్ ఇండియాతోనే స్వాతంత్ర్యం

వరంగల్: క్విట్ ఇండియా ఉద్యమం వల్లనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ జి.సంపత్ అన్నారు. క్విట్ ఇండియా వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఎల్‌బీ నగర్‌లోని పద్మావతి మహిళా కళాశాల ఎన్‌సీసీ బెటాలియన్‌లోని కేడె ట్స్ ఆధ్వర్యంలో కళాశాల నుంచి పోచమ్మమైదాన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కొనసాగుతున్న ధర్నా

కాశిబుగ్గ : దేశంలోని మిగతా రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలోని ఆయుర్వేద హౌస్ సర్జన్లకు స్టైఫండ్ పెంచాలని చేస్తున్న ధర్నా ఐదో రోజుకు చేరింది. వైద్య బుధవారం చేసిన ధర్నాకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్‌లు మద్దతు తెలిపారు.

సేవలు వినియోగించుకోవాలి

కాజీపేట: పోస్టాఫీస్‌లు ఉత్తరాల బట్వాడాకే పరిమితం కాకుండా అనేక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం పంచుకుంటున్న నేపథ్యంలో ప్రజలు వినియోగించుకోవాలని ఏఎస్పీ రమాదేవి అన్నారు.పోస్ట్‌మాస్టర్ రాజేందర్, ఉషశ్రీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి



హన్మకొండ: స్వాతంత్ర్య పోరాటయోధులను స్మరిస్తూ నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావడమే వారికి అర్పించే ఘననివాళి అని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బుధవారం హంటర్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో మాజీ సైనికులను ఆమె సన్మానించారు.

రన్నింగ్‌రేస్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యారణ్యపురి: హనుమకొండలోని బాలసముద్రంలోని ఫైన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కె.ప్రణీత బుధవారం జరిగిన 400 మీటర్ల రన్నింగ్ రేసులో తెలంగాణ రాష్ట్ర ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచిందని హైస్కూల్ చైర్మన్ కుమార్ యాదవ్ తెలిపారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలో నిర్వహించిన రన్నింగ్ రేసులో ఆమె అసాధారణ ప్రతిభను కనపర్చారని తెలిపారు. డైరెక్టర్లు రాజేందర్, రమేష్ యాదవ్‌లు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ప్రణీతను అభినందించారు.

మంత్రి ఎర్రబెల్లికి ఘనసన్మానం

హన్మకొండ : జనబంధు అవార్డు అందుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును రెడ్డి జేఏసీ నాయకులు సన్మానించారు. బుధవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయం ఆర్అండ్ బీ అతిథి గృహంలో మంత్రి ఎర్రబెల్లిని రెడ్డి జేఏసీ నాయకులు కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.